నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, సోమవారం 16 డిసెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర

ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలి

- మున్నూరు కాపులను గుర్తించిన మాజీ సీఎం కేసీఆర్
- పది మందికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించారు
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- అమీనాపురంలో ఎంకే కన్వెన్షన్ హాల్ ప్రారంభం
- పాల్గొన్న మాజీ మంత్రి గంగుల, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, నన్నపునేని, శంకర్‌నాయక్

కేసముద్రం, డిసెంబర్ 15 : మున్నూరు కాపులు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని అమీనాపురం గ్రామంలో ఆదివారం ఎంకే కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించి మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మున్నూరు కాపులను గుర్తించి పది మందికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా టికెట్లు కేటాయించారని గుర్తు చేశారు. మున్నూరు కాపులు రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలని సూచించారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలంటే నిర్లక్ష్యాన్ని వీడి పట్టుదలతో పనిచేయాలన్నారు. రాష్ట్రంలోని మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మున్నూరుకాపులు ఐక్యంగా ఉంటూ ఫంక్షన్ హాల్ నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంకే కన్వెన్షన్ హాలుకు రూ. ఐదు లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఫంక్షన్‌హాల్ నిర్మించుకొని రెండు రాష్ట్రాల్లోని మున్నూరు కాపులు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు వీ హనుమంతరావు, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మహబూబాబాద్, వరంగల్ తూర్పు, పశ్చిమ మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్ నాయక్, దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, కేసముద్రం మండల అధ్యక్షుడు చందా గోపి, రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వద్దిరాజు కిషన్, వీ ప్రకాశ్, ఏకాంతం, స్వామి,మురళి, శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇండ్లడిగితే అరెస్ట్ చేస్తారా?

లబ్ధిదారులకు సంఘీభావం తెలుపుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

- ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన..
- మంత్రులతో మాట్లాడినా ఎందుకివ్వడం లేదు?
- కాంగ్రెసోళ్లకు ఇచ్చేందుకే ఎమ్మెల్యే కాలయాపన
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల నిరసనకు సంఘీభావం

కృష్ణకాలనీ, డిసెంబర్ 15 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు పట్టాలివ్వాలని అడిగిన నిరుపేదలను అరెస్ట్ చేస్తారా? ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన? అంటూ భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. ఇండ్లు లేని పేదలుండొద్దనే లక్ష్యంతో తమ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి 392 మందికి కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. గత 22 రోజులుగా భూపాలపల్లి 11వ వార్డు భాస్కర్‌గడ్డలోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద పట్టాల కోసం నిరసన తెలుపుతున్న లబ్ధిదారులకు ఆదివారం గండ్ర సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 నెలల క్రితం లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లు నేటికీ గృహ ప్రవేశాలకు నోచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్న లబ్ధిదారుల వద్దకు అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోవడం బాధాకరమన్నారు. రెండు రోజుల క్రితం తాను ఇక్కడికి వచ్చి లబ్ధిదారులను పరామర్శించడంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించి వెంటనే పట్టాలు ఇవ్వాలని కోరడంతో సానుకూలంగా స్పందించారన్నారు. శనివారం మంత్రులు శ్రీధర్‌బాబు, రాజనర్సింహ భూపాలపల్లి జిల్లాలో పర్యటించినా డబుల్ బెడ్రూం ఇళ్ల విషయమై మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. పైగా లబ్ధిదారులు తమ గోడును మంత్రులకు చెప్పుకోవడానికి వస్తే, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పోలీసులతో అడ్డుకొని, అరెస్టులు చేయించడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఇవ్వాలనే ఉద్దేశంతోనే పట్టాలివ్వడంలో ఎమ్మెల్యే జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. గూడు లేని పేదలను ఇబ్బంది పెడితే వాళ్ల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పక తాకుతుందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ 392 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పేదల పక్షాన ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతానని గండ్ర హెచ్చరించారు. ఆయన వెంట భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, కౌన్సిలర్లు మేకల రజిత, ఎడ్ల మౌనిక, ఆకుదారి మమత, బానోత్ రజిత, జక్కుల రవికుమార్, మంగళపల్లి తిరుపతి, ముంజంపల్లి మురళీధర్, కో ఆప్షన్ మెంబర్ బేతోజు వజ్రమణి, బీబీ చారి, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, నాయకులు బండారి రవి, సింగనవేణి చిరంజీవి, జోరు ఈశ్వర్, కుమార్ యాదవ్, పోలవేణి ప్రసాద్, ఎండీ కరీం, రాజు, వేణు, శ్రీ కాంత్ పటేల్, రాకేశ్, స్వప్న పాల్గొన్నారు.

ఏఎస్సై పేరుతో ఉపాధ్యాయుడికి టోకరా

రూ. 60 వేలు మోసపోయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

గూడూరు, డిసెంబర్15: ఏఎస్సై పేరుతో ఉపాధ్యాయుడికి టోకరా వేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపు యజమానికి భాస్కర్‌రెడ్డి పేరుతో 7661957326 నుంచి ఫోన్ చేసి గూడూరు ఏఎస్సైని మాట్లాడుతున్నానని, ఎస్సై పేరెంట్స్‌కు అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని, రూ. 60 వేలు ఫోన్‌పే లేదా గూగుల్ పే చేస్తే నగదు పంపిస్తానన్నాడు. షాపు యజమాని తన వద్ద లేవని తెలిపాడు. కాగా అంతకుముందే ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాంకుడోత్ గోపీనాథ్ షాపు యజమానికి తన ఖాతాలో డబ్బులున్నాయని, లిక్విడ్ క్యాష్ కావాలని చెప్పాడు. ఈ విషయాన్ని షాపులో పని చేస్తున్న బాలు తన మిత్రుడైన గోపీనాథ్‌కి తెలిపాడు. అనంతరం గోపీనాథ్‌కు భాస్కర్‌రెడ్డి ఫోన్ చేసి డబ్బులు ఫోన్‌పే చేయాలని, లిక్విడ్ క్యాష్ బాలుకు పంపిస్తున్నానని తెలిపాడు. దీంతో గోపీనాథ్ 8888680873 నంబర్‌కు డబ్బులు పంపించాడు. ఎంతసేపటికీ నగదు పంపకపోవడంతో గోపీనాథ్ తనకు వచ్చిన, డబ్బులు పంపించిన నంబర్లకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కంగారు పడిన గోపీనాథ్ గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భూపాలపల్లి ఏరియాలోని తాడిచెర్ల బ్లాక్‌లో సింగరేణి అన్వేషణ విభాగం డ్రిల్లింగ్ యంత్రం

అనుమతి లేకనే ఆపాం..

సింగరేణి సంస్థ అనుమతి లేకుండా అడవుల్లో బొగ్గు అన్వేషణ పనులు చేపడుతున్నది. ఈ క్రమం లో తాడిచెర్ల బ్లాకులో ఐదు సింగరేణి డ్రిల్లింగ్ యంత్రాలు బొగ్గు అన్వేషణ పనులు అటవీ శాఖ అనుమతి లేకుండా కొనసాగిస్తున్నాయి. దీంతో పనులు నిలిపివేశాం. ఈ విషయమై పైఅధికారులతో చర్చలు జరుగుతున్నాయి.
– నవీన్‌రెడ్డి, డీఎఫ్‌వో, భూపాలపల్లి

అసలేం జరిగింది ?

యాజమాన్యం సింగరేణివ్యాప్తంగా 11 డివిజన్లలో సంస్థకు చెందిన అన్వేషణ విభాగంతో బొగ్గు నిల్వల అన్వేషణ పనులు కొనసాగిస్తుంది. ప్రస్తుతం 11 డ్రిల్లింగ్ యంత్రాలతో బొగ్గు నిల్వలను అన్వేషించి సంస్థకు నివేదిక ఇస్తుంది. దీని ఆధారంగా గనులను ఏర్పాటు చేస్తూ బొగ్గు వెలికితీత ప్రక్రియను ప్రారంభిస్తుంది. అయితే ప్రస్తుతం భూపాలపల్లి ఏరియాలో అన్వేషణ విభాగానికి చెందిన ఐదు డ్రిల్లింగ్ యంత్రాలు తాడిచెర్ల బ్లాక్-2లో అన్వేషణ పనులు కొనసాగిస్తున్నాయి. అయితే అడవుల్లోని చెట్లను తొలగిస్తున్నారంటూ గత నెల 7న భూపాలపల్లి డీఎఫ్‌వో వసంత వెలికితీత పనులను నిలిపివేశారు. అప్పటినుంచి పనులు ముందుకుసాగడం లేదు.

- నెల రోజులుగా నిలిచిన పనులు
- తాడిచెర్ల బ్లాక్-2లో ఐదు డ్రిల్లులకు ఆటంకం
- ఫలించని అటవీ శాఖ, సింగరేణి చర్చలు
- సంస్థకు తీవ్రనష్టం

చెట్లు కొట్టేస్తున్నారని అటవీ శాఖ అభ్యంతరం

బొగ్గు అన్వేషణకు బ్రేక్

అటవీ, సింగరేణి చర్చలు విఫలం

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బొగ్గు అన్వేషణకు బ్రేక్ పడింది. సింగరేణి బొగ్గు అన్వేషణ విభాగం(ఎక్స్‌ప్లోరేషన్) ఆధ్వర్యంలో తాడిచెర్ల అడవుల్లో బొగ్గు నిక్షేపాల కోసం చేసే డ్రిల్లింగ్ పనులను అటవీ అధికారులు అడ్డుకోవడంతో గత నెల రోజులుగా పనులకు ఆటంకం ఏర్పడింది. దీని వల్ల బొగ్గు నిల్వలను గుర్తించడమే గాక ఉద్యోగులకు వేతనాల రూపేనా సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. ఈ విషయమై సింగరేణి, అటవీ అధికారుల మధ్య చర్చలు జరిగినప్పటికీ సమస్య కొలిక్కి రాలేదు. అంతేకాదు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జోక్యం చేసుకుని అటవీ శాఖ అధికారులతో మాట్లాడినా ఫలితం లేదని తెలుస్తోంది. వెలికితీత పనులు నిలిపివేయడంతో పలుమార్లు స్థానిక సింగరేణి అధికారులు అటవీ శాఖ అధికారులను కలిసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును ఆశ్రయించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే చెప్పినా అటవీ అధికారులు స్పందించలేదని సమాచారం. ఈక్రమంలో అటవీశాఖ, సింగరేణి ఉన్నతాధికారుల సమావేశం హనుమకొండ, హైదరాబాద్‌లలో జరిగినట్లు తెలిసింది. అయినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. సింగరేణివ్యాప్తంగా ఏళ్ల తరబడి అన్వేషణ విభాగం పనులు కొనసాగుతున్నాయని, ఎప్పుడూ ఇలా జరుగలేదని, అడవుల్లో అన్వేషణ విభాగం పనులు కొనసాగిస్తున్న క్రమంలో కొన్నిచెట్లు తొలగిస్తామని, అందుకుగాను అటవీ శాఖకు డబ్బులు చెల్లిస్తున్నామని సింగరేణి అధికారి ఒకరు చెప్పారు. నెల రోజులుగా అన్వేషణ విభాగం పనులు నిలిచిపోవడంతో సంస్థకు సుమారు రూ.30 లక్షల నష్టం వాటిల్లడంతో పాటు సంస్థ నిర్దేశిత డ్రిల్లింగ్ టార్గెట్‌లను చేరుకోలేకపోతున్నది.

మొదటిరోజు గ్రూపు-2 పరీక్ష ప్రశాంతం



హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ వద్ద నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

- వరంగల్, హనుమకొండ, భూపాలపల్లిలో 50 శాతం మించని హాజరు
- పలుచోట్ల ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు
- పరీక్షా కేంద్రంలోకి అనుమతించని అధికారులు
- ఆయా సెంటర్లను పరిశీలించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

హనుమకొండ/ఖిలావరంగల్/భూపాలపల్లి రూరల్/ములుగు, మహబూబాబాద్ రూరల్/జనగామ చౌరస్తా, డిసెంబర్ 15: ఉమ్మడి జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8.30, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు. లేటుగా వచ్చిన వారిని పరీక్ష కేంద్రాల్లోకి అధికారులు అనుమతించకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు. వరంగల్ జిల్లాలో 11,310 మంది అభ్యర్థులకు 5,275 మంది, హనుమకొండ జిల్లాలో 33006 మందికి 16,312 మంది, భూపాలపల్లి జిల్లాలో 4,423 మంది అభ్యర్థులకు ఉదయం 2,152 మంది, మధ్యాహ్నం 2,181 మంది హాజరయ్యారు. మహబూబాబాద్ జిల్లాలో 7,470 మంది అభ్యర్థులకు ఉదయం 3,886 మంది, మధ్యాహ్నం 3,868 మంది, ములుగు జిల్లాలో 2,195 మంది అభ్యర్థులకు ఉదయం 1,104, మధ్యాహ్నం 1,113 మంది, జనగామ జిల్లాలో 5,470 అభ్యర్థులకు ఉదయం 2,959, మధ్యాహ్నం 2,947 మంది పరీక్ష రాశారు. హనుమకొండ, వరంగల్‌లో కలెక్టర్ సత్యశారద, ములుగు అదనపు కలెక్టర్ సంపత్‌రావు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

రవాణా సౌకర్యం లేక ఆలస్యం

పరీక్ష రాయని పలువురు అభ్యర్థులు

ములుగు, డిసెంబర్15(నమస్తేతెలంగాణ): ములుగు జిల్లాలో గ్రూప్-2 అభ్యర్థులకు రవాణా సౌకర్యం లేక పరీక్ష మిస్సయ్యారు. జిల్లా కేంద్రంలోని సాధన, బ్రిలియంట్, లిటిల్‌ఫ్లవర్ స్కూల్, బండారుపల్లి మోడల్ పాఠశాలలోని సెంటర్లకు అభ్యర్థులు చేరుకునేందుకు రవాణా పరంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా మరి కొందరు వాహనదారులను లిఫ్ట్ అడిగి సెంటర్లకు చేరుకున్నారు. సాధన స్కూల్ సెంటర్‌లో భవాని, బండారుపల్లి మోడల్ స్కూల్ సెంటర్‌లో జీపీ కార్యదర్శి క్రాంతితో పాటు తాడ్వాయి గ్రామానికి చెందిన దయాకర్, సారంగపల్లి గ్రామానికి చెందిన ఆమని లేట్‌గా రావడంతో అధికారులు వారిని లోపలికి అనుమతించకపోవడంతో వెనుదిరిగారు. సెంటర్ల వద్దకు అధికారులు రవాణాపరమైన సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో పాటు హెల్ప్ డెస్క్ సెంటర్లను నిర్వహించకపోవడంతో అభ్యర్థులు ఆయోమయానికి గురయ్యారు.

పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందికి దండం పెట్టి బతిమాలుతున్న అభ్యర్థిని

ఫ్రీ బస్సు సౌకర్యంతో

హనుమకొండ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగి దొంగలు రెచ్చిపోతున్నారు. ప్రయాణికుల్లో కలిసిపోయి క్షణాల్లో మహిళల మెడలో నుంచి బంగారు ఆభరణాలు, బ్యాగులు మాయం చేస్తున్నారు. బస్సుల్లో సైతం బ్యాగులు మాయం చేయడంతో పాటు పండుగలు, జాతరల సమయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో సరిపడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో నింబితులను గుర్తించడం కష్టమవుతున్నదని, బస్సెక్కేటప్పుడు ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

- సుబేదారి, డిసెంబర్15

హనుమకొండ బస్‌స్టేషన్‌లో ఏడాదిలో 14 చోరీలు

బస్టాండ్‌లో.. జర భద్రం

- ఫ్రీ బస్సు రద్దీతో పెరిగిన దొంగతనాలు
- బస్సుల్లో సైతం ప్రయాణికుల బ్యాగులు మాయం
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ బస్‌స్టేషన్ అతిపెద్దది. వరంగల్ రీజియన్‌లోని వరంగల్ 1, వరంగల్2, హనుమకొండ, భూపాలపల్లి, పరకాల, తొర్రూరు, నర్సంపేట, జనగామ, మహబూబాబాద్ డిపోలతోపాటు ఇతర జిల్లాలకు చెందిన ఆర్టీసీ బస్సులు 3 నుంచి 4వేల వరకు నడుస్తుంటాయి. రోజూ సగటున లక్ష నుంచి లక్షా 20వేల మధ్య ప్రయాణికులు ఇక్కడి నుంచే హైదరాబాద్, బెంగళూరు, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ తదితర దూర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ఫ్రీ బస్సు సౌకర్యంతో హనుమకొండ బస్‌స్టేషన్‌లో రద్దీ విపరీతంగా పెరిగింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు సరిపడా లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచిచూస్తుంటారు. బస్సులు పాయింట్ వద్దకు రాగానే సీట్ల కోసం ఎగబడడంతో దొంగలు ప్రయాణికుల్లో కలిసిపోయి చోరీలకు పాల్పడుతున్నారు. అదేవిధంగా రీజియన్ తొమ్మిది డిపోల నుంచి 82లగ్జరీ బస్సులు నడుస్తుండగా, ఇందులో సుమారు 30 బస్సుల్లో మాత్రమే సీసీ కెమెరాలు ఉన్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. వీటిల్లో కూడా చోరీలు జరుగుతున్నా కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులు దొంగలను పట్టుకోలేకపోతున్నారు. ఇటీవల జరిగిన చోరీల్లో మహిళా దొంగలు మాస్కులు, స్కార్ఫ్‌లు కట్టుకొని బస్సు ఎక్కే క్రమంలో వెనుక నుంచి వచ్చి మెడలో ఉన్న గోల్డ్ చైన్లు కొట్టే స్తున్నట్లు సీసీ పుటేజీల్లో తేలింది.

హనుమకొండ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ, (ఇన్‌సెట్) బస్టాండ్‌లో పనిచేయని సీసీ కెమెరా

ఇటీవల జరిగిన చోరీ కేసులు కొన్ని..

ఈ ఏడాది ఫిబ్రవరి 2న యూసఫ్‌గూడకు చెందిన యువతి హైదరాబాద్ వెళ్లడానికి హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సు ఎక్కి లోపల కూర్చున్న కొద్దిసేపటికే బ్యాగ్ మాయమైంది. అందులో 6.5 తులాల గోల్డ్ ఉంది. మార్చిలో మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు చెందిన మహిళ బస్సు ఎక్కుతుండగా మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెలతాడు, గోల్డ్ చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తి కొట్టేశాడు. జూన్9న నల్లబెల్లి మండలానికి చెందిన యువతి హైదరాబాద్ వెళ్లడానికి బస్సులో ఎక్కిన కొద్దిసేపటికే మెడలో ఉన్న 12 గ్రాముల గోల్డ్‌చైన్ చూసుకుంటే లేదు. ఈ కేసులో పోలీసులు దొంగను గుర్తించి గోల్డ్ చైన్ రికవరీ చేశారు. ఈ నెల 7న దుగ్గొండి మండలానికి చెందిన తల్లీ, కూతురు ఉప్పల్ ఎక్స్‌రోడ్డులో వరంగల్1డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఎక్కి డ్రైవర్ వెనక సీట్లో కూర్చుని బ్యాగ్‌ను పైన పెట్టారు. హనుమకొండలో దిగిన తర్వాత బ్యాగులోని 9 తులాల గోల్డ్ చైన్లు చోరీకి గురయ్యాయి. 13న హుజూరాబాద్‌కు చెందిన మహిళ హైదరాబాద్‌లో కుమారుడి వద్దకు వెళ్లడానికి బస్సు ఎక్కుతుండగా మెడలోని రెండున్నర తులాల పుస్తెలతాడును దొంగలు ఎత్తుకెళ్లారు.

జనవరి-డిసెంబర్ 15 వరకు 14 చోరీలు..

ఏడాది జనవరి నుంచి డిసెంబర్ 15వరకు హనుమకొండ బస్‌స్టేషన్‌లో 14 చోరీలు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ఏటూరునాగారం, మహబూబాబాద్, ఖమ్మం పాయింట్ల వద్ద ఎక్కువగా చోరీలు జరుగున్నాయి. ఆర్టీసీ అధికారులు 4 నుంచి 8 మెగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, 2 మాత్రమే బిగించారు. అవి కూడా బస్‌స్టేషన్ లోపలే ఉన్నాయి. అన్ని పాయింట్ల వద్ద, బయటికి, లోపలికి వెళ్లే మార్గాల్లో కెమెరాలు లేకపోవడంతో చోరీ కేసుల్లో నిందితులను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం

హనుమకొండ బస్‌స్టేషన్‌లో చోరీలు జరగకుండా మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. రద్దీ పెరగడంతో చోరీలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించడానికి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.
– డీ విజయబాబు, వరంగల్ ఆర్‌ఎం

అభ్యర్థి, అధికారుల నిర్లక్ష్యంతో పరీక్ష మిస్

జనగామ జిల్లా కేంద్రంలో అభ్యర్థి భూక్యా సునీత అయోమయానికి గురై పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయింది. శాన్‌మారియా హైస్కూల్ సెంటర్‌కు బదులు దాని పక్కనే ఉన్న సెయింట్ మేరీస్ హైస్కూల్‌కు వెళ్లింది. ఓఎంఆర్ షీట్ ఇచ్చిన తర్వాత ఆమె ఈ విషయాన్ని గుర్తించి వెంటనే శాన్ మారియా కేంద్రానికి వెళ్లే సరికి ఆలస్యం కావడంతో అక్కడి అధికారులు లోపలికి అనుమతించలేదు. అభ్యర్థితో పాటు క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పరీక్ష రాయలేకపోయింది. దీంతో సునీత కన్నీటి పర్యంతమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు పరీక్ష కేంద్రాలు పక్కపక్కనే ఉండడం వల్ల హాల్ టికెట్‌పై ఉన్న సెంటర్ కోడ్, పేరును గుర్తించడంలో తన భర్త కాస్త

జనగామ చౌరస్తా: నిర్లక్ష్యంతో పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయిన సునీత

అయోమయానికి గురైనట్లు తెలిపారు. ఆ సమయంలో తను చంటిబిడ్డను ఎత్తుకున్నట్లు పేర్కొన్నారు.

వైభవలక్ష్మి షాపింగ్ మాల్ ప్రారంభం

గిర్మాజీపేట, డిసెంబర్ 15 : వరంగల్ జేపీఎన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వైభవలక్ష్మి షాపింగ్ మాల్‌ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యాపార రంగాన్ని ఎంచుకొని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరకే వినియోగదారులకు అందించాలని యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ యువ డైరెక్టర్లు వర్రి లలిత్, ప్రదీప్‌కుమార్ బజాజ్, సూరజ్, పల్లం రిషితను స్పీకర్ అభినందించారు. సిల్క్, టెక్స్‌టైల్స్, మెన్, ఉమెన్, ఎత్నిక్స్, కిడ్స్ వేర్‌ను తక్కువ ధరకే విక్రయిస్తున్నామని, రూ. 10 వేల కొనుగోలుపై బంగారు నాణెం అందిస్తున్నామని, విద్యార్థులకు ప్రత్యేకంగా 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు గందె కల్పన, పల్లం పద్మ రవి పాల్గొన్నారు.



షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

పేషెంట్‌కేర్ సిబ్బంది లేకపోవడంతో బాలుడిని స్ట్రెచర్‌పై వార్డుకు తరలిస్తున్న కుటుంబసభ్యులు

రోగులను పట్టించుకోరా?

- ఎంజీఎంలో పేషెంట్ కేర్ సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న కుటుంబ సభ్యులు, అటెండెంట్లు

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 15: పేదల పెద్దాస్పత్రిగా గుర్తింపు పొందిన ఎంజీఎంలో రోగులను పట్టించుకునే సిబ్బంది కరువయ్యారు. ప్రతి విభాగంలో రోగుల వైద్య, పారా మెడికల్ పరీక్షల నిమిత్తం తరలించడానికి ఏర్పాటు చేసిన పేషెంట్ కేర్ సిబ్బంది నిర్లక్ష్యం వారికి శాపంగా మారుతున్నది. నిత్యం వందల సంఖ్యలో రోగులను చేర్చుకునే ఎంజీఎంలో పరీక్షలు, వైద్య సేవల కోసం వివిధ విభాగాలకు తరలించడం, మార్చడం జరుగుతుంటుంది. ఇటీవల అత్యవసర విభాగంలోని ఎక్స్‌రే మొరాయిస్తుండడంతో రోగులను రేడియాలజీ విభాగానికి తరలిస్తున్నారు. రోగి ఆరోగ్య స్థితిని, వారికి బిగించిన వైద్య పరికరాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా పేషెంట్ కేర్ సిబ్బంది తరలిస్తుంటారు. అత్యవసర విభాగంలో వీరు ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉండాలి. కానీ ఎంజీఎంలో అవసరానికి పేషెంట్ కేర్ సిబ్బంది అందబాటులో లేకపోవడంతో అటెండెంట్లే రోగులను స్ట్రెచ్చర్లలో తరలిస్తున్నారు. అనుభవ లేమి, రోగి ఆరోగ్యస్థితిపై ఏమాత్రం అవగాహన లేని అటెండెంట్లు తరలిస్తుండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేషెంట్ కేర్ సిబ్బందికి ఇతర విధులు సైతం కేటాయిస్తుండడంతో అన్ని విభాగాల్లోనూ ఈ పరిస్థితి వస్తున్నది. ముఖ్యంగా అత్యవసర విభాగంలో ఉంటున్నట్లు రోగులు, అటెండెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.